నాగరికమా? సతీత్వమా?

శ్రీమతి సి. కమలాబాయి గారు

రాము, చేతిలో నిలువకుండా యేడ్చుచున్నాడు. రామును సముదాయించుచు భర్తవద్దకు వచ్చుచున్నది సుశీల.

"ఛీ, ఛీ దూరముగా తీసుకుపో వాడిని!! యెంత తెలివిమాలినదానవు!! సమయసందర్భాలు కూడ తెలుసుకోవు, యిందుకే నీకు నాకు సరిపోనిది. (చెవులు మూసుకొని) అబ్బబ్బ యేమిఅల్లరి. ముందు యిక్కణ్ణించి వెళ్ళిపో" అన్నాడు ఆలోచించుచు కూర్చున్న ప్రసాద్.

సుశీల, రామునితీసుకొని అవతలికి వెళ్ళిపోయింది. కొంతసేపున కంత నిద్రపోయినాడు రాము. సుశీలకు, భర్తకెదురుగా వెళ్ళుటకు సాహసము లేకపోయెను. వసారాలో కూర్చుని రామాయణం చదువుకొనుచుండెను. ఆమె తనధ్యానంలో ప్రసాదువచ్చినదికూడా గుర్తింపలేకపోయినది.

"చాలు, చాలు రామాయణంచదివిరేదివ్వావులే! కాఫీతీసుకురా" అన్నాడు ప్రసాదు కోపంతో.

ఈమాటలువినినదే భయముతో మెల్లగా "మీ రేమో ఆలోచించుచున్నారని నే వచ్చుటికిరాలేదు. కాఫీ తయారుచేసి వుంచినాను" అంటూ కాఫీ గ్లాస్ తెచ్చి అతని ముందర పెట్టింది.

"నీముఖంలాగేవుంది ఈకాఫీ" అని కాలితో తన్ని వేశాడు, ప్రసాద్.

౧

సుశీలమనసు చాలచిన్నపోయింది. "నా మొఖం యెట్లావున్న యికయేమి. పెండ్లిఅయిపోయినది.యిక నేనెట్లావున్న నేమి? మీరు నాతో నేకాదా కాపురము చేయవలెను?" అన్నది.

"ఓహో అటుల తలచుచున్నావా? యెప్పటికీ కాదు. నాయిష్టము. నేను నిన్ను వివాహమాడసమ్మతింప లేదు. మాతలిదండ్రులే నిన్ను నాకు పనునారవయేట గొంతున కురిపోసినారు. నాకు నీకు యెప్పటికి జత పడదు." అన్నాడు ప్రసాద్ ఆగ్రహముతో.

సుశీల యిదిఅంతయు పురుషులకోపమే గాని వేరు కాదని తలచినది. కోపముతగ్గుతేని అంతయు శాంత పడునని తలచెను. పాప మావాక్యములు నిజమని కల నైనను తలపలేదామె.

సత్వము "యెంతసేపికోపము? నాకోసరము కాకున్నను రామునిజూచి......"

"నా జన్మపర్యంతము! యెవ్వరిని జూచినను నా మనసు మారజాలదు. నన్నెవ్వరు ఆడ్డగింపజాలరు." అనుచు అక్కడనుంచి వెళ్లిపోయినాడు ప్రసాదు.

ప్రసాద్ నూతనముగావచ్చిన అడ్వకేటు. సుశీల అతని మేనత్తకూతురగుటచే పెద్దవారు ప్రేమతో చిన్నతనమునందే పెండ్లిచేసిరి. కొన్నిదినములవరకు భార్యనుగూర్చి యెటువంటిచింతయు ప్రసాదునకు లేకుండెను. అతను బి. యే. చదువునప్పటినుంచి అతని మనసు మార్పుకెందెను. అతడు, తనకుతగిన భార్యకాదుకదాయని రేయింబవళ్లు దుఃఖించెడివాడు. ఆఖరుకు తానెటులయినను తనతోపాటు ఆంగ్లమును మాటాడుచుండుకన్యను వివాహమాడ నిశ్చయించు కొనెను. సుశీలకు ఆంగ్లము తెలియదు. ఆంధ్రము చక్కగా చదువగలదు. అత్తవారింటికంపునపుడు తలిదండ్రులుచెప్పిన సతిధర్మమే యామె నాగరికత. ఈ కారణములచే ప్రసాదు సుశీలలకు చాలదూర ముండెను.

* * *

"వసంత" బి.యే. ప్యాస్ చేసినది. ఆమె డాక్టర్ కూతురు. ప్రతిరోజు సంధ్యవేళలయందు టెన్నిస్ క్లబ్బునకు వచ్చుచుండెడిది. ప్రసాదు, ఆమె హృదయమును తనలో కట్టివేయవలయునని చాలప్రయ త్నముసల్పెను. గాని అతనికి తగు సమాధానము

దొరకలేదు. ఆరోజు సంధ్యాకాలము. మెల్ల మెల్లన వీచు మందమారుతము ఆక్లబ్బులోని పుష్పవృక్షముల పైబడి సుగంధపరిమళముతో వీచుచుండెను. ఆరోజు క్లబ్బులో యెక్కువ జనులు లేకుండిరి. తోటలోనున్న కుర్చీలన్నియు ఖాళీగా నుండెను. అచ్చటనున్న ఒక కుర్చీమీద ప్రసాదుకూర్చుని దీర్ఘంగా ఆలోచించుచు ఒక్కనిరాశగల నిట్టూర్పు విడచెను. అకస్మాత్తుగా ఒకమృదువగు కంఠము "మీ రేవిషయమునుగురించి అంతగా ఆలోచించుచున్నారు?" అన్నది.

ఆశ్చర్యముతో "మీ రెప్పుడు వచ్చినారు?" అన్నాడు ప్రసాద్.

"నేనువచ్చి పదినిముషములయినది. అయిన 'మీరు' అని నన్ను సంబోధించుట నాకిష్టములేదు" అన్నది. వసంత.

"యెన్నడును నీవద్ద నాకంతటిచనువు దొరకనందున నేనటుల పిలువజాలకుంటిని. నాకు నీహృదయమున ......"

"కాదు, కాదు నా కాకోరికలేదు. మీరటుల తలుపవద్దు. మీకు వివాహమయినదిగదా?" అన్నది వసంత.

"వసంతా! నిజముచెప్పుచున్నాను. పెండ్లిఅయిన నేమి? నాకు దానిపై ప్రేమలేదు. అది శుద్ధమూఢురాలు" అన్నాడు, ప్రసాద్.

క్రీగంట ప్రసాదునిచూచుచు "మీ రామాటను అనవద్దు. నాకోరికలువేరు. వాటిని మీ రనుసరించుట అసాధ్యము" అన్నది.

"లేదు వసంతా! నీకోసర మెంతకఠిన కార్యమయిననుసరే..."

"........."

"యేమి వసంతా! మాటలాడవు. నీకొరకై అవసరమగునేని యీదేహమునైనను తునకలు తునకలుగా కోసి యివ్వగలను."

"నిజముగ..."

"అందుకు సందేహములేదు మున్ముందుకి. నాకోరిక మాత్రం...నన్ను నీలో......"

మాటలాడుచుండగనే యిరువురి ప్రేమదృక్కులు యేకీభవించినవి.

౨

వసంతా ప్రసాదులకు వివాహమయిపోయినది. ప్రసాద్ ఒక పెద్ద మేడయిల్లు అద్దెకు తీసుకున్నాడు. యింట్లో ఒక కారు, యిరువురు బంట్రోతులు, టీ పార్టీలు, డ్రామాలు, సినీమాలు, యింతయేల మాస మునకువచ్చు వరుమానముకన్న వందరూప్యములు యెప్పుడు యెక్కువ సెలవగుచుండెను. అయితే యిపు డతనికోరిక నెరవేరినది. వసంత యెప్పుడును ఆంగ్లమే మాటాడును. మేడపైననే ఆమెనివాసము. ఇపుడు సర్వము వసంతచేతిలో నున్నది. సుశీలగృహమునకు వసంత అధికారిణియైపోయినది. సుశీల మొదట ఈ సంగతి వినగనే దుఃఖముచేత రెండుమూడు దినముల వరకు నిద్రాహారములువదలి ఆలోచనానిమగ్నయయి వుండెను. ఆఖరు కామె ధైర్యము తెచ్చుకున్నది. పతివ్రతల చరిత్రలను తలచుకున్నది. ఏమయిననుసరే పతియే దైవము. వారికి సేవచేయుట నాకర్తవ్యము అని ఆమె తనమనసున నిర్ధారణచేసుకున్నది. ఇక తన సంతోషమునకు గాను జోక్యము చేసుకొని తలచినది. ప్రసాద్ సుశీలతో మాటాడుటమానెను. ఆమె, యే మాటయు మాట్లాడకూడదనియు, అటుల మీరిమీరి మాట్లాడునేని పుట్టింటికి వెళ్లిపోవలయుననియు కఠినముగ ఆజ్ఞయొసంగెను ప్రసాదు. ఏమయిననుసరే పుట్టింటికి వెళ్ళనన్నది సుశీల. ఇప్పుడు ప్రసాద్ గృహమునకు సుశీల వంటమనిషి. ప్రతిదినము వంట కాగనే వసంతప్రసాదులకు మేడమీదికి భోజనము తీసుకొని వెళ్లుటయు, వారిరువురును భుజించగనే నిశ్శబ్దముగా క్రిందికి దిగివచ్చుటయు అలవాటు. రాముకూడ మేడపైకి వెళ్లుటలేదు. ఆమెకుగాని, రామునికిగాని మంచిబట్టలు లేవు. ఆమె దినదినము నకును కృశించి శల్యమయిపోవుచుండెను. అయితే

యిప్పుడామెహృదయము తనస్వామి సందర్శనమాత్రమునకే ఆనందభరితమై యీకష్టములను లెక్కగొనలేదు.

* * *

శాస్త్రిగారును వారిభార్య సావిత్రమ్మయు తమ యేకపుత్రికయగు సుశీలకష్టములనుతలచి దుఃఖించుచుండిరి. తమపుత్రికను అనుకొన్నపుడంతయు వారి కడుపులు తరుగుకొనిపోయెడివి. వారు తమమేనల్లుడగు ప్రసాదును పరిపరివిధముల దూషించెడివారు. శాస్త్రిగారు, ప్రసాదునకు తమపుత్రిని యెటులయినను పంపివేయవలయుననియు, యిక ఒక్కక్షణము కూడ వారింట దాస్యముచేయుచు నుండకూడదనియు ఖండితముగ చాలఉత్తరములువ్రాసిరి. గాని వాటిని లక్ష్యముచేయకుండా చించి బుట్టలో పారవేయుచుండెను ప్రసాదు. తమ ఉత్తరములకు జవాబు రానందున, తమ పుత్రియొక్క విచారములోనే క్రుళ్లుచుండినసావిత్రమ్మ మంచము పట్టినది. ఆమె వ్యాధి, దినదినమునకు అధికమగుచుండెను. ఇకఆమె బ్రతుకుటయు దుర్లభముగా నుండెను. శాస్త్రిగారే స్వయముగా సుశీలను తోడ్కొనివెళ్లుటకై వచ్చిరి. శాస్త్రిగారినిజూచియు ప్రసాదు పలుకరింపలేదు. శాస్త్రిగారు ప్రసాదు తన్ను లక్ష్యముచేయనందున కోపముతో అతనితో మాటాడనని శపథముచేసెను. సుశీలతో "సుశీలా! మీతల్లి చాలజబ్బుగానున్నది. నిన్ను చూడవలయునని కలవరించుచున్నది. ఇక ఒక్కక్షణమయినను యీ చండాలుని గృహమున నుండవలదు. ఆలసించక నాతోకూడా రా?" అన్నాడు శాస్త్రిగారు.

"తండ్రీ! వారి నన్యాయముగా తిట్టవలదు. అంతయూ నాప్రారబ్ధమేగాని వేరుగాదు. తమకు వయసు మించినందున కోపమధికమగుచుండును. శాంతింపుడు. ఒక్కమారు నేను వారివద్దకువెళ్లి సెలవందివచ్చెదను." అన్నది సుశీల శాంతంగా.

"ఏమనుచున్నావు! ఇంకా ఆపాపాత్ముని కాళ్లా పట్టుకొనకోరుచున్నావా? వద్దు! వద్దు!" అన్నాడు శాస్త్రి. గాని ఆమాటలు వినకుండగనే మేడమీదికి వెళ్ళింది సుశీల. ఆసమయమున వసంతప్రసాదులు గదిలోకూర్చుని మాటలాడుచున్నారు. "నేను ఇప్పుడు ఇక్కడికి వచ్చినందులకు క్షమింపుడు" అనుచు లోనికి వెళ్లింది సుశీల. ఏవగింపుతోడను, కోపముతోడను సుశీలవంక చూచింది వసంత.

సుశీల తనభర్తపాదములకు నమస్కరించి వినయముతో "నాథా! నాతల్లి జబ్బుగానున్నందున నా తండ్రిగారు నన్ను తోడ్కొనిపోవ వచ్చియున్నారు. ఒక వారముదినములు మాత్రము పుట్టింటికి వెళ్లివచ్చుటకు అనుమతి యొసంగవలయును." అన్నది.

ప్రసాదు కాళ్లను బలవంతముగా వెనుకకు లాగుకొని కోపముతో "పొమ్ము నన్నడుగుటేమి? మరలనీవు రావలయునని యెవరు కోరిరి?" అన్నాడు. ఈమాటలు వినగనే పక్కున నవ్వింది వసంత. అవమానము, దుఃఖము భరింపలేకపోయినది సుశీల. ఆమె కన్నుల నుండి నీరు కాలువలై స్రవింప మొదలిడెను. తడబడుచు మేడనుండి దిగిపోయింది సుశీల. వసంత యేమరియున్న సమయమున ప్రసాద్, సుశీల వెళ్ళిన త్రోవనే చూచుచుండెను, యెటులనో వసంత అతనిని చూచి దిగ్భ్రమ జెందినది. 'భార్య భర్త లిరువురు యేకమయిపోవుదురా యేమి' అనుకొనుచుండెను. శాస్త్రిగారును సుశీలయు ప్రయాణ సన్నద్ధులయిరి. కాని రాముని పుట్టినదాదిగా పెంచుచున్న దాదియగు గంగిని వదిలి రాము రాజాలకుండెను. శాస్త్రిగారు తమ పుత్రికతో ప్రయాణమయిరి.

3

మంచముమీద లేవ శక్తిలేకుండా పండుకున్న సావిత్రమ్మ యెండిపోయిన మల్లెపువ్వువలె నున్న తన పుత్రికను ప్రక్కన కూర్చుండపెట్టుకొని ఆమె తలను చేతులతో తడవుచు అంతులేని కన్నీళ్ళుకారుస్తున్నది. మెల్లగా ఆమె సుశీలతో "అమ్మా సుశీలా! నాముద్దుల తండ్రి రాముని గనుకొని

రాకూడదా? నాతండ్రి నాకండ్లయందరి నే వున్నాడు. అయ్యో! నాతల్లీ, నాకడుపు మండుచున్నదే. నిన్ను యెంతో అద్దుముద్దుగా పెంచి వున్నధనమంతయు వెచ్చించి నిన్నేమో ఉద్ధరిస్తాడని ఆ పాపికి, ఆ ద్రోహికి, నాయేకరత్నాన్ని, అర్పిస్తిని. అదుష్టుడిట్లు నాబిడ్డ సంసారమును గూల్చునని...." ఆమె మాటాడజాలకపోయెను. ఆమె కంఠము అస్పష్టమైనది. మరి కొంతసేపునకు నిట్టూర్పువదల చాల ప్రయత్నముతో పెదవి కదలించెను గాని మాటాడజాలకపోయెను.

"అమ్మా! నీవు వూరకవుండుము. జరిగిన విషయములగూర్చి చింతింపకుము. మానవులకు కష్టసుఖములు సమానములు. ఒకరి కష్టసుఖముల కొకరు కారణులుకారు. అంతయు వారి వారి కర్మఫలము. ఎంతప్రాప్తమో అంతే నిలచును. అందుకై చింతించిన యేమి ప్రయోజనము. నీదేహము చాలాబలహీనముగా నున్నది. విశ్రాంతి పుచ్చుకొనుము."అన్నది సుశీల.

ప్రేమతోడను ఆశ్చర్యములోడను ఆగుంటలు పడిన కన్నులు తెరచి సుశీల వంక చూచినది సావిత్రమ్మ. మరి కొంతసేపునకు ఆమె కన్నులు మూసుకున్నది. డాక్టరులందరు ఆమెను చేయివదలుకొనిరి. ఆమె హృదయమున మనోవ్యాధి నాటిపోయినది. ఇక ఆమె జీవించునను ఆశలేకుండెను. గాని సుశీల వచ్చినప్పటినుంచి తల్లికి యేమరకుండ సేవ చేయుచుండెను. గాని సుశీలవచ్చిన అయిదారు దినములకంతయు ఆమె ఈలోకమునువదలి వెళ్ళిపోయెను. సుశీల యిప్పుడు పూర్తిగా దిక్కులేనిదై పోయెను. ఆమె రెండుమూడు మాసములవరకు తల్లి మరణమునుగూర్చి దుఃఖించుచు పుట్టింటనే నిలచిపోయినది.

◆ ◆ ◆

సుశీల యెంత సద్గుణవతియైయినను, సవతియను మాత్సర్యము వసంతకులేకపోలేదు. సుశీల పుట్టింటనే యుండిన బాగుండునని తలచింది వసంత. యెటులయినను సుశీలను తనయింటిగడప మెట్టించకూడదని అనేక యుక్తులను యోచించుచుండెను.

సుశీల ప్రయాణమయిన దినమున ప్రసాదు కేలనో మనసు నెమ్మదిగా లేకుండెను. కోర్టునకు వెళ్ళిన కొంతసేపటికంతయు గృహమునకు వచ్చివేసెను. ఉస్సురుమనుచు టేబిల్ కెదురుగుండావున్న కుర్చిపై కూర్చొనెను. అతనికి టేబిల్పై ఒక ఉత్తరమగుపించెను. ఆవుత్తరములోని అక్షరములు యొక్కువ అనుభవములేనివారు వ్రాసినట్లుండెను. ఆ అక్షరము లతనికి పరిచయములేనివిగ నుండెను. అజాబు విప్పి చదివెను. అతనికేమి స్ఫురింపలేదు. మరల చదివెను. హఠాత్తుగ్రాహియగు అతనిబుద్ధి మందగించెను. అతనికన్నులు కోపముతో యెఱ్ఱబారెను. ఆలోచనాశూన్యుడయ్యెను. ఆ జాబులోని విషయమిట్లుండెను.

"యెంతఓర్పుగల స్త్రీ యయినను యెంతని ఓర్చుకొనగలదు. మీరు కొద్దిదినముల కయినను నాతో కాపురము చేయుదురని తలంచితిని గాని ప్రయోజనము లేకపోయెను. నిజమునకు మా తల్లికి జబ్బు లేదు. మీతో నుండ యిష్టములేకయే నే వెళ్ళిపోయితిని. యిక నా విషయమును గూర్చి మీరొక్క సంగతియు విచారింపవలసిన పనిలేదు. మీరెట్లు మీ యిష్టప్రకారము వివాహము చేసికొంటిరో అట్లే నేనును నాయిష్టప్రకారముండగలను. మీరు యిక మీదట నన్ను మరచిపోవలయునని కోరుచున్నాను.

సుశీల."

అజాబును కోపముతో గుసకలు తునకలుగా చించిపారవేసెను. పండ్లు పటపట కొరుకుచు, "ఓసీ! మాయలాడి, చండాలీ, నీకు పతిసేవ యొకటి తక్కువయా? ఎంతటి టక్కులాడివే. నీకు తగిన ప్రాయశ్చిత్తము ముందే చేసివేసితిని. ఇక చీ! చీ! నీ మొఖము మేల చూడవలయును. ఎప్పటికిని చూడను." యనుచు క్రోధమున పిచ్చివాడైయుండెను ప్రసాద్.

౪

'సుశీల తనభర్తను విడనాడినదట' యను సంగతి ఆ వూరను, ఆ వూరికద్దనున్న గ్రామములను అలుము

కొన్నది. పలువురు పలువిధములుగా అనుకొనసాగం గిరి. కొందరు "అయ్యో పాపము యిది యెవరికో ఓర్వలేనివారి పన్నాగమే కాని వేరుకాదు. ఆమె మహాసాధ్వి, ఆమెనన్నవారి కన్నులుపోవును" అని అనుకొనుచుండిరి. ఈసంగతి ఆఖరుకు శాస్త్రిగారి సుశీలకు కూడ తెలిసినది. తల్లి దుఃఖముతో క్రుంగు చున్న సుశీలకు పిడుగువంటి యీవార్త ఆమెను చాలా ముంచేసింది. ఆమె యీనిందను భరింప లేకుండెను. ఆమె యెటులయినను భర్త సన్నిధానము నకు వెళ్లిపోవలయునని తలచినది. యిప్పటి కామె పుట్టిల్లుచేరి 4 మాసములు కావచ్చినది. ఇంతవరకు ఆమె భర్త్రృ గృహమునకు తండ్రిని తోడ్కొని పొమ్మని అనేకమారులు వేడుకొన్నది. శాస్త్రిగారా మాట వినినప్పుడంతయు కోపోద్దీపితులయి మండి పడుచుండెడివారు. "ఇంకను నీకు అతనిని చూడ వలయునని కోరికయున్నదా? అతను నిన్ను లక్ష్యము చేయడు. నాప్రాణ మున్నంతవరకు నీ కేమాత్రము కొదువచేయను. అతని గృహము నిన్ను త్రొక్కనివ్వను నేనును త్రొక్కను." అనెను శాస్త్రిగారు.

ఆమె ఇక తండ్రిని వేడుట నిష్ప్రయోజనమని తలచినది. ధైర్య మవలంబించినది. పతి సన్నిధి కెటులయినను వెళ్ళిపోవలయునని పలువిధముల ఆలోచింప దొడంగినది.

◆ ◆ ◆

శాస్త్రిగారింటికిని స్టేషనునకును మూడుమైళ్ళ దూరము. రాత్రి పన్నెండుగంటలు. అమావాస్య గాఢాంధకారము. యెదురుగానున్న వస్తువు కనిపించనంతటి చీకటి. అక్కడక్కడ మునిసిపల్ దీపములు మినుక్కు మినుక్కు మనుచున్నవి. ఆ అంధకారములో నిలువున తెల్లని ముసుగు వేసుకున్న ఒక స్త్రీ, వీధులను, గృహములను దాటి ఒంటరిగా అడవి మార్గముగా స్టేషనునకు వెళ్ళుచుండెను. ఆకాశమున దట్టమయిన మేఘము లావరించినవి. దుమ్ముతో నిండిన గాలి కన్నులు తెరువనివ్వలేదు. క్రమక్రమముగా గాలి, వాన పెద్దదయిపోయినది. ఆ అబలకు యెటుపోవుటకు దారి తెలియలేదు. ఆ చిమ్మచీకటిలో ఒక పెద్దవృక్షమునకు కొట్టుకొన్నది ఆమె. మరియు ఆమె దేహమున బలముగ గాయములు గలిగెను. కొంతసేపునకు ఆమె మూర్ఛజెందినది. అటు పిమ్మట యేమయ్యెనో ఆమెకు తెలియదు.

తెలవర్ఝామున నాలుగైదు గంటలయివుండును. వాన తగ్గిపోయి కొంచెము వెలుగుగ నుండెను. అచ్చటచ్చట చిన్నచిన్న వాననీటిగుంటలుండెను. ఆఅడవి మార్గముగా ఒక రెండెడ్లబండి పోవుచుండెను. బురదలో చక్రములు సరిగా నడవకుండుటచే బండి తోలు రైతు బండినుండి దిగి చక్రములను చేతులతో బలముగా త్రోయుచుండెను. అకస్మాత్తుగా అతని కొకమూలుగు శబ్దము వినవచ్చెను. శబ్దము వినిన దిక్కునకే వెళ్లిచూడగా సుశీల మాటాడజాలక పడియుండెను. ఆమె దేహము రక్తమయముగానుండెను. ఆమెను చూడగనే రైతు మనసు నీరైపోయినది. అతను ఆమెను తనబండిలో పరుండజేసికొని దాపుననున్న గ్రామములోని ధర్మాస్పత్రిలో ఆమెను చేర్చినాడు. అటు పిమ్మట కొద్దిదినములకంతయు ఆమె దేహము ఆరోగ్యముజెందినది గాని ఆమె యిప్పుడు చాల విరూపియయిపోయినది. యిప్పు డెవ్వరు ఆమెను గుర్తింపజాలరు. శాస్త్రిగారు తమ పుత్రిక కనుపింపకపోయిన నాటినుండి ఆమెను చాలా వెదికిరి గాని ఆయనకు ఆమె జాడ తెలియకుండెను. తన భార్యతోడ తనబిడ్డయు వెళ్లినదని నిశ్చయించుకొనిరి.

❧

గంగి, వసారాలో రాముని ఒళ్ళోనుంచుకుని కూర్చున్నది. రామునివంక విచారముతో చూచుచు "నాయనా! రామూ, నీవెంత దురదృష్టవంతుడవు. నీవు పుట్టినదాదిగా యేముచ్చటల నెరుగవు. నాధర్మలక్ష్మి సుశీలాదేవి కెంతటి అవమానము గల్గినది. ఆమె ఈసంగతి విని యేమయినదో, నాతల్లి! ఆమె సంగతి తెలియకున్నది. అయ్యో, నాతల్లి ఈసంగతి విని తనప్రాణము నేమయినను..." దుఃఖము [illegible]కొన

జాలక యేడ్చెను. గంగినిజూచి రాముకూడ యేడ్చు చుండెను.

ఒక యువతి నిలువుమునుకుతో లోనప్రవేశించి "గంగీ! బాగున్నావా? యేది నాపుత్రుని ఒక్కమారిటు తెమ్ము"అన్నది.

(ఆశ్చర్యముతో) "ఎవరు, యెవరు, యేమి నేను కలగనుచున్నానా? లేక నిజమేనా? అమ్మా! ప్రాణములతో నున్నారా? మీరేనా నాయజమానురాలగు సుశీలాదేవిగారు. అయ్యో!యెంతటి గతిపట్టినదమ్మా! ఇదియేమి రూపమమ్మా, యింతటి మలినపుగుడ్డలు, యిట్టి దశను జూచుటకా నేనింకను బ్రతికియున్నాను." అన్నది దుఃఖ మాపుకోనజాలక గంగి.

(దీర్ఘముగా శ్వాసమువదలి) "గంగీ! నాకు మరణము లేదుకాబోలు" ననుచు రాముని ఆలింగనము చేసికొని కళ్ళనీళ్ళతో అతనిని ముద్దిడుకున్నది. "గంగీ! పోనీ. అయ్యగారు యెట్లున్నారు. ఆరోగ్యమేకదా? చెల్లి వసంత బాగున్నదా"అన్నది, సుశీల.

"ఇంకెక్కడ చెల్లి తల్లీ, నీకొంపకూల్చిన చెల్లి. అయ్యగారి ప్రాణం తినేస్తున్నది. ఇప్పుడు గొప్ప గొప్ప వక్కీళ్ళకే వరుమానాలు తగ్గిపోయినవి ఇక మన అయ్యగారి సంగతి యడుగవలయునా? చాలా మందికి అయ్యగారు ఋణపడియున్నారు. అదే చింతలో మనోవ్యాధిగల్గి చాల కృష్కించిపోవు చున్నారు. ఒకరిద్దరు నౌకర్లను తీసివేయవలయునని కోరుచున్నారు. గాని వసంతమ్మ ఒప్పుకోదు. ఇచ్చటి స్థితులు యిట్లున్నవి'' అన్నది గంగి.

విచారంలో సుశీల "ఈకష్టసమయమున నే నేవిధముగా వుపకారము చేయగలను? గంగీ! నేనొక దాసిదాననియు, వారింటిలో వంటచేయుదుననియు, నాకు భోజనము మాత్రము చాలును, డబ్బు అక్కర లేదనియు చెప్పినచో నన్ను వారింటిలో చేర్చుకొన గలరా?'' అన్నది.

"తల్లీ! యెంత పిచ్చిదానవు, నీయింటికి నీవే దాసిదానవా? స్వామీ! నీవే యీతల్లిని రక్షించు. స్వీకరించ లేమి తల్లీ, అయితే నే నామాటలు వారితో చెప్పజాలను.'' అన్నది గంగి.

"గంగీ! నీకు చాలాపుణ్యము. నిన్నెప్పటికి మరువను. యెటులయినను వెళ్లిచెప్పవలెను అన్నది" సుశీల. కడపట గంగి చెప్పక తప్పినదికాదు. ఈసంగతి వినగనే వదిరూపాయలాసమయమున మిగులునని సంతోషించి ఆమెవంటమనిషిగానుండుటకు ప్రసాద్ ఒప్పుకొనెను. సుశీల అచ్చట వంటమనిషిగానుండ మొదలిడెను. ఆమె సదా ముసుగుతో నున్నందున ఆమె ఉత్తరహిందుస్థానపు యువతి యని భావించెను కొన్ని దినములవరకు ప్రసాద్. వసంతకు మాత్ర మా మాటయందు విశ్వాసములేదు. ఆమెయందు సంశయమే వసంతకు.

◆ ◆ ◆

రామునకు నాలుగైదు దినములుగా తీవ్ర జ్వరము వచ్చుచుండెను. అతను కన్నులు తెరువకుండా చాపపైపరుండి యుండెను. అతని దేహము వేడిచే పెట్లిపోవుచుండెను. సుశీలకు కాళ్లుచేతులు కదలలేదు. ఆమె తన పుత్రునివీడి వెళ్ళలేకుండెను. ఆమె వేళకు వంటకూడ చేయులేకుండెను గాని వసంత యొక్క భయంకరమగు అధికారము ఆమె హృదయాన్ని బెదరించుటచే ఆమె యేదో ఒక విధముగా వంటచేసెడిది. కాని ఆమె వేళకు అన్నాహారములు తీసుకొనెడిదికాదు. జ్వరబాధతో పరుండియున్న రాముని ప్రక్కన సుశీల కూర్చున్నది. తన గృహములోని యిబ్బందులచే ఆరోజు గంగి రాజాలకుండెను. రామున కాదినము మందుతెచ్చి యిచ్చువారును లేకుండిరి. ఆరోజు సుశీలకు, దేవుడు లేడా యేమి అనిపించినది. రాత్రి తొమ్మిదిగంటలు, కారుశబ్దము వినవచ్చినది. యెవరో బూట్సులతో టిక్కుటక్కున దిగుచున్న చప్పుడు వినవచ్చినది. సుశీల వారిని చూడగనే గ్రహించినది—వారు సినీమాకొరకై ప్రయాణమగుచున్నారని. వసంత సిల్కుచీర కట్టుకున్నది, మొఖమున పౌడర్ వేసుకున్నది, పైటమీద

బ్రోచి, చేతిలో కర్చీఫు నుంచుకొని మేడమెట్లు దిగుచుండెను. ఆమె వెనుక ప్రసాద్ మాటు బూటులతో కూడా దిగుచుండెను. సుశీల తాళజాలక పోయెను. ఆమె ఆత్రముతో వారి కెదురుగా వెళ్ళి,

"అయ్యా! తమబిడ్డడు మరణావస్థలో నున్నాడు. దయలేదా? అదిగో అచ్చట చూడుడు. ఆబిడ్డడెంత దిక్కులేనివాడుగా నున్నాడో. యెవ్వరు లేక కడుపునపుట్టిన బిడ్డను, తండ్రియయ్యు మీరు యీయవస్థలో వదలి ఆనంద మనుభవింప వెళ్ళ మనసెటుల గల్గుచున్నది. యీ ఒకరోజాగుడు. ఆబిడ్డకు తగు చికిత్సలు చేయుడు." అన్నది.

ప్రసా దాకంఠము వినగనే సర్వము మరచిపోయెను. అతని హృదయము కరగిపోయెను. "వసంతా! యీరోజు నే రాజాలను, నన్ను క్షమించుము" అన్నాడు దీనంగా.

"యేమనుచున్నారు? మన అన్నముతిని బ్రతుకు ఒకదాసిదాని మాటలకా మీరు జేలిపోవుచున్నారు. ఇంతటి పిరికిపందలని ముందే తెలిసినచో..."

"తెలిసినచో యేమిచేయుదానవు?" అన్నాడు.

కోపముతో "మిమ్ము పెండ్లియాడకుందును" అన్నది.

"పెండ్లియాడకుందువా? యిదియా నీ నిర్మలమగు ప్రేమ......సరేరా పోదము" అన్నాడు.

"స్వామి! స్వామి ఈరోజు మాత్రమాగుడు." అన్నది సుశీల.

"ఛీ, దూరముగా పో! దాసి దానికింతనోరా? ఇంత అధిక ప్రసంగమా? లే ఛీ నీ వీయిల్లువదలి వెళ్ళిపో" అన్నది వసంత కోపావేశముతో. మారు మాటాడజాలక పోయెను ప్రసాద్. భగ్నహృదయముతో వెనుకకు మరలినది సుశీల. వసంతప్రసాదులు కారులో కూర్చున్నారు. చూచుచుండగనే అదృశ్యమయిపోయినది కారు.

సుశీల ఒళ్ళోవున్న రాముకాళ్ళు చేతులు చల్లబడిపోయినవి. సుశీల హృదయం రాయయిపోయినది. ఆమె ఒక్కింతసేపు రెప్పవాల్పకుండ తనపుత్రుని వంక చూచుచుండెను. ఆమె తన కంటినీళ్ళతో ఆ బాలుని స్నానమొనరించినది. మెల్లగా బాలుని క్రింద పరుండజేసినది. మేడపైకివెళ్ళి ఒక ఉత్తరము వ్రాసి ప్రసాద్ మంచముపై నుంచినది. ఆమె వీధి తలుపుతీసుకొని యెచ్చటికో వెళ్ళిపోయింది.

◆ ◆ ◆

రాత్రి ఒంటిగంటకు ప్రసాద్ వసంతలు గృహము జేరిరి. వసంత అలసినదై రాగనే మంచముపై పరుండి నిద్రించెను. గాని ప్రసాదునకు సంసారబాధలును, ఋణబాధలును హృదయమును భేదించుచుండెను. అతని కంటికి నిద్దుర రాకుండెను. అతను మంచముపైపరుండి ఇటువటు పొర్లుచుండెను. అతనికి ఒక ఉత్తరము ఆమంచముపై దొరకెను. అతనా ఉత్తరమును వెలుగులో నిట్లు చదివెను.

ప్రాణేశ్వరా!

నాకు గలిగిన అపాండమగు నిందను భరింపజాలక పోయితిని. మీకు గల ఋణబాధలనుగూర్చి వింటిని. నామనసుకు చాలచింత గలిగినది. గాని మీరు నన్ను చూడనని శపథముచేసినట్లు వింటిని. యెటులయినను తమకు సేవచేయుచుండవలయునని మారు రూపమున వంటమనిషిగానుంటిని. నాపుత్రునితో ఆనందించుచుంటిని. అదియు ఈశ్వరునికి సమ్మతము గాక పోయినది. నాబిడ్డను తన సన్నిధికి తోడ్కొని వెళ్లెను. మీరును నన్ను త్యజించితిరి. నాకిక యీ లోకమున యేమున్నది. నాజీవితము వ్యర్థమేకదా? నాపుత్రుని జేర వెళ్ళుచున్నాను. అఖరుసంగతి. మీకు అందిన వుత్తరములో నాఅక్షరములవలె యేవరో వ్రాసిరేకాని నాకు తెలియదు. నేనునిర్దోషినని మీ హృదయపూర్వకముగా నమ్ముడు. ఇక సెలవొసంగుడు. వందనములు.

ఇట్లు
సుశీల.

29

ఈ జాబు చదువగానే ఒక్కసారిగ అతనికొరకై సుశీల పడిన కష్టములును ఆమె ప్రేమయు స్మృతి గల్గెను. అతను కొన్నిదినములకు పూర్వమే ఆలోచించి ఆమె నిర్దోషియని స్థిరముచేసుకొనెను. తన యింటిలోనున్నది సుశీలయేయని యెప్పుడతని మనసుకు సందేహముగల్గెనో అప్పుడే అతడామెను క్షమాపణ కోరుకొననందులకు చింతించెను. అతను క్రిందికి వచ్చి తన పుత్రునిపైబడి వెక్కి వెక్కి యేడ్వదొడంగెను. "నాతండ్రీ, నీవు బ్రతికియుండగా నీముచ్చటల జూచి సంతోషింపజాలక కామోన్మత్తుడనయి యుంటిని. ఇక చాలును. ఈపాపాత్మునకు తగిన ప్రాయశ్చిత్తమయినది. నాతండ్రీరమ్ము! యీరోజున నిన్ను నా రెండుచేతులతో నెత్తుకొనెద"ననుచు శవమును ఆ అర్ధరాత్రియందు తీసుకొని వీధివంక వెళ్లెను. ఆటుపిమ్మట ఆతనా చీకటిలో యేమయ్యెనో యెవరికెరుక?

ఉద్బోధనము

శ్రీమతి టి. రుక్మిణి అమ్మాళ్‌గారు

లోకమంతా లేచి
చీకాకు పడుతూంటే
కళ్ళు మూశావేమి—నాచెల్లెలా
కలలు గంటున్నావె—నాచెల్లెలా.

తల్లిబాసా వదలి
తల్లిదేశం కదలి
పరుగులేస్తా వేస—నాచెల్లెలా
పడమటా ఏముందె—నాచెల్లెలా.

మననాటి చరితాలు
మనవారి కార్యాలు
తిరిగ్గ తిరిగేయి—నాచెల్లెలా
తిప్పాలు పడకమ్మ—నాచెల్లెలా.

పాతచెత్తల కట్ట
పనిలేదు నాకంచు
కట్టుచేయకు మమ్మ—నాచెల్లెలా
రతనాలు దొరకవా—నాచెల్లెలా.

ఝాన్సిరాణీ కత్తి
ఝుళిపించి యుద్ధాన
స్వాతంత్ర్య దేవికై—నాచెల్లెలా
సకలమ్ము వదలదా—నాచెల్లెలా.

బిరుదాలకై డబ్బు
బిరబిరా పోస్తావు
కడుపు కాలేవాళ్ల—నాచెల్లెలా
కళ్లువిప్పి చూడు—నాచెల్లెలా.

దేశమాతా పిలుపు
దిక్కులంతా నిండె
నడుముకట్టి నిలుము—నాచెల్లెలా
పుడమి కీర్తిగనుము—నాచెల్లెలా